

కీచకుడు చిక్కేదెలా?

ఇటీవల ఓ 90 ఏళ్ల వృద్ధురాలిపై లైంగిక దాడికి పాల్పడిన కామాంధుడు ఇప్పటికీ పోలీసులకు చిక్కలేదు. 8లో▸



డబుల్ బెడ్రూం ఇళ్లు ఇవ్వాలి

డబుల్ బెడ్రూం ఇళ్లను లబ్ధిదారులకు వెంటనే ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి యాదయ్య డిమాండ్ చేశారు. 8లో▸



కాలువ కబ్జాపై నిలదీత

వరద కాలువ కబ్జాకు గురైందని గగ్గోలు పెడుతున్నా పట్టించుకోవడం లేదని కొంగర కలాన్‌వాసులు మండిపడ్డారు. 8లో▸

న్యూస్‌రీల్

మంత్రి వాకిటి శ్రీహరికి శుభాకాంక్షలు



మంత్రికి శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్‌: క్రీడలు, రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రిగా పదవీ బాధ్యతలు స్వీకరించిన మంత్రి వాకిటి శ్రీహరికి షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం మంత్రి బాధ్యతల స్వీకరణోత్సవానికి హాజరైన ఎమ్మెల్యే ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి, శాలువా కప్పి సన్మానించారు.

మంత్రిని కలిసిన డీసీసీబీ చైర్మన్

తుర్కయంజాల్: మంత్రి వాకిటి శ్రీహరిని టెస్కాబ్ వైస్ చైర్మన్, డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య సోమవారం కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

సరైన చికిత్సతో టీబీ నిర్మూలన



టీబీ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

మీర్‌పేట: సరైన చికిత్స, జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా ప్రాణాంతకమైన టీబీ వ్యాధి నుంచి బయటపడొచ్చని జిల్లా ప్రోగ్రాం అధికారి పాపారావు అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో సోమవారం జిల్లెలగూడలోని మీర్‌పేట పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో టీబీ ముక్త్‌భారత్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో ఇతర అంటు వ్యాధుల కంటే టీబీ మరణాలే అధికంగా నమోదవడం ఆందోళన కలిగించే విషయమన్నారు. టీబీ ముక్త్‌భారత్ అభియాన్‌లో భాగంగా వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం ఉచితంగా చికిత్స అందిస్తోందని తెలిపారు. ప్రజల్లో టీబీ గురించి అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అనంతరం పలువురికి టీబీ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యాధికారి బాలమణి, మీర్‌పేట కమిషనర్ జ్ఞానేశ్వర్, సూపర్‌వైజర్లు కమలకుమారి, రాజేందర్‌రెడ్డి, హెల్త్ అసిస్టెంట్‌లు అజయ్, సైదులు, రవీందర్‌రెడ్డి, ఏఎన్ఎం కవిత, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

విచారణకు హాజరైన పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి

ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం



విచారణ అనంతరం బయటకు వస్తున్న విష్ణువర్ధన్‌రెడ్డి

షాద్‌నగర్: సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసు వ్యవహారం షాద్‌నగర్‌కు పాకింది. ఇందులో ప్రధాన నిందితుడు, స్పెషల్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో మాజీ చీఫ్ ప్రభాకర్‌రావును సిట్ అధికారులు లోతుగా విచారిస్తున్నారు. ఈకేసులో బాధితుల జాబితాను సిద్ధం చేసి, విచారణ చేస్తున్నారు. ఇందులో భాగంగా షాద్‌నగర్‌కు చెందిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డిని సోమవారం నగరంలోని జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌కు పిలిపించి విచారణ నిర్వహించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో విష్ణువర్ధన్‌రెడ్డి సింహం గుర్తుపై పోటీ చేశారు. ఈసమయంలో కలిగిన ఇబ్బందులు, నమోదైన కేసుల వివరాలను అడిగారని విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. గత సంవత్సరం నవంబర్ 15 నుంచి 30 తేదీ వరకు తన ఫోన్ ట్యాపింగ్ జరిగినట్లు పోలీసుల వద్ద వివరాలు ఉన్నాయన్నారు.

మెట్రోరైల్‌కు రైల్వే సేఫ్టీ ఎక్సలెన్సీ అవార్డు

సాక్షి, సిటీబ్యూరో: ఎల్అండ్‌టీ హైదరాబాద్ మెట్రో రైల్‌కు ప్రతిష్టాత్మక రైల్వే సేఫ్టీ ఎక్సలెన్స్ అవార్డు లభించింది. ఈనెల 13న న్యూఢిల్లీలో జరిగిన ఎకనమిక్ టైమ్స్ ఇన్‌ఫ్రా రైల్ షో–2025లో అవార్డు దక్కించుకున్నట్లు అధికారులు తెలిపారు. భారతీయ రైల్వేలతో మెట్రో రైళ్లకు ప్రతిసంవత్సరం ఈ అవార్డును అందజేస్తారు. భద్రత, సుస్థిరత, సాంకేతికత, డిజిటల్ ఆవిష్కరణలు, అర్బన్ కనెక్టివిటీలో అగ్రగాములుగా నిలుస్తూ, దేశీయంగా రైల్ ఆధారిత మొబిలిటీ భవిష్యత్తును తీర్చిదిద్దుతున్న సంస్థలుగా మెట్రోలను పరిగణిస్తూ ఈ పురస్కారాలను ఇస్తారు.

ప్రక్షాళన.. పూర్తయ్యేనా!

పెరిగిపోతున్న ఎండోమెంట్ పెండింగ్ కేసులు

- విచారణలో కీలక సాక్ష్యాలుగా మారిన ముంతకబ్ రికార్డులు
- నాటి ఉర్దూను అర్థం చేసుకోవడంలో అధికారుల ఇబ్బంది
- ఇంగ్లిష్‌లోకి అనువదించాలని లోకాయుక్త ఆదేశాలు
- ఏళ్లు గడుస్తున్నా పూర్తి కాని తర్జుమా ప్రక్రియ
- అన్యాక్రాంతమవుతున్న ఆలయ భూములు



సాక్షి, రంగారెడ్డిజిల్లా: దేవాలయాల భూములకు రక్షణ లేకుండా పోతోంది. హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో భూముల ధరలు అమాంతం పెరగడంతో కేటుగాళ్లు నకిలీ పత్రాలు సృష్టించి ఆక్రమణలకు పాల్పడుతున్నారు. చివరికి వివాదాలు కోర్టులు, ఎండోమెంట్ ట్రిబ్యునల్స్‌కు చేరుకుంటున్నాయి. ఈ వివాదాల పరిష్కారంలో నిజాం కాలం నాటి ఉర్దూ భాషలో ముద్రించిన ముంతకబ్ రికార్డులు కీలక సాక్ష్యంగా నిలుస్తున్నాయి. వందల ఏళ్ల క్రితానికి చెందిన ఈ రికార్డులు ప్రస్తుతం అవసాన స్థితికి చేరుకున్నాయి. ముట్టుకుంటే చిరిగిపోతున్నాయి. నాటి ఉర్దూను అర్థం చేసుకోవడం నేటి అధికారులకు ఇబ్బందిగా మారింది. ఆలయ ఈఓలకు ఉర్దూపై కనీస పట్టు లేదు. దేవాలయ భూములపై అవగాహన లేకపోవడంతో కోర్టుల్లో కేసులు వీగిపోతున్నాయి. విలువైన ఆలయ భూములు చేజారిపోతున్నాయి. అంతే కాదు ముంతకబ్ రికార్డుల్లోని దేవాలయాల పేర్లు, ట్రస్టీ, ఫౌండర్ల గోత్ర నామాలు గుర్తించలేని స్థితికి చేరుకున్నాయి. వివాదాల పరిష్కారంలో కీలకమైన ఈ రికార్డులను భద్రపరచడంతో పాటు ఉర్దూ నుంచి ఆంగ్లంలోకి తర్జుమా చేసి, భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని లోకాయుక్త సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటి వరకు ఈ ప్రక్రియ పూర్తి చేయక పోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

దేవాదాయశాఖ భూములు (ఎకరాల్లో)

జిల్లా	మొత్తం భూమి	అన్యాక్రాంతం
మేడ్చల్	4,125.03	2,888.18
రంగారెడ్డి	9,360.01	1,148.15
హైదరాబాద్	5,718.01	2,374.25
వికారాబాద్	2,294	444.16

ఎండోమెంట్ ట్రిబ్యునల్‌లో కేసులు

2010 నుంచి ఇప్పటి వరకు నమోదైనవి	2,100
ఇప్పటి వరకు పరిష్కారమైనవి	1,365
ఇప్పటికీ పెండింగ్‌లో ఉన్నవి	735
హైదరాబాద్‌లో ఉన్న పెండింగ్ కేసులు	140
సికింద్రాబాద్‌లో పెండింగ్‌లో ఉన్న కేసులు	66
రంగారెడ్డి జిల్లాలో పెండింగ్‌లో ఉన్న కేసులు	249
ఇప్పటి వరకు తర్జుమా అయిన ముంతకబ్‌లు	1,013
అనువాదం పూర్తికాని రికార్డులు	1,000పైనే



ఎంఈఓ అక్బర్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న డీఈఓ సుశీందర్‌రావు

పని తీరు మారాల్సిందే

- ఉత్తీర్ణత శాతం తగ్గడంపై డీఈఓ సీరియస్
- నెల రోజుల్లో మార్పు రావాలని ఆదేశం

శంకర్‌పల్లి: పట్టణం, మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, మోడల్ స్కూల్‌లో ఇంటర్ విద్యార్థుల ఉత్తీర్ణత శాతం ఎందుకు తగ్గిందని జిల్లా విద్యాధికారి సుశీందర్ రావు ఎంఈఓ, ప్రధానోపాధ్యాయులను ప్రశ్నించారు. శంకర్‌పల్లి మోడల్ స్కూల్‌లో సోమవారం ఎంఈఓ, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్, శంకర్‌పల్లి ప్రభుత్వ బాలికల, బాలుర పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫలితాలపై ఆయన ప్రశ్నల వర్షం కురిపించి సీరియస్ అయ్యారు. మోడల్ స్కూల్‌లో పది, ఇంటర్ విద్యార్థుల ఉత్తీర్ణత శాతం తగ్గడంపై విశ్లేషించుకోవాలని సూచించారు. రాజకీయాలు మాని విద్యార్థులపై దృష్టి సారించాలని హెచ్చరించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన బడిబాటను కొన్ని పాఠశాలలు నిర్వహించకపోవడం, మరికొన్ని స్కూళ్ల మొక్కుబడిగా చేయడంపై మండిపడ్డారు. జూలై 15న మళ్లీ సమీక్ష నిర్వహిస్తానని, పరిస్థితి పూర్తిగా మారాలన్నారు. సమావేశంలో ఎంఈఓ అక్బర్, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ శోభారాణి, తదితరులు పాల్గొన్నారు.

పని నచ్చకపోతే బదిలీ చేయండి

తన పని నచ్చకపోతే.. మరో చోటికి బదిలీ చేయాలని శంకర్‌పల్లి మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ శోభారాణి డీఈఓ సుశీందర్‌రావుకి చేతులు జోడించి విన్నవించారు. సమీక్ష సమావేశం నిర్వహించిన అనంతరం ఆమె డీఈఓతో మాట్లాడారు. 'సార్ మా పాఠశాలలోనే ఎంఈఓ కార్యాలయం ఉంది, ఎవరెవరో వచ్చి వెళ్తున్నారు.. దీనిని మరో చోటికి మార్పించండి' అని చెబుతుండగా ఎంఈఓ అక్బర్ కల్పించుకున్నారు. 'నువ్వు ఊరుకోవమ్మా.. అనవసరంగా ఎక్కువ మాట్లాడకు' అంటూ సీరియస్ అయ్యాడు. దీంతో ప్రిన్సిపాల్ తాను పాఠశాలకి వచ్చి కొన్ని నెలలే అవుతోందని, తన పని నచ్చకపోతే.. మరో చోటికి బదిలీ చేయాలని, చేతులు జోడించి కోరింది. మహిళలతో అలా దురుసుగా మాట్లాడొద్దని డీఈఓ ఎంఈఓను హెచ్చరించారు.

కేంద్ర పథకాలతో నిరుపేదలకు మేలు

కందుకూరు: కేంద్రంలో ఏన్డీఏ ప్రభుత్వం 11 ఏళ్లుగా అమలు చేస్తున్న పథకాలు నిరుపేదలు, బడుగు బలహీన వర్గాలకు ఎంతో మేలు చేశాయని బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో సోమవారం పార్టీ మండల అధ్యక్షుడు నిమ్మ అంజిరెడ్డి ఆధ్వర్యంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. కేంద్రం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, అవగాహన కల్పించాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కష్టపడి పని చేసి పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందెల శ్రీరాములుయాదవ్, కడారి జంగయ్యయాదవ్, మండల ఇన్‌చార్జి పోరెడ్డి అర్జున్‌రెడ్డి, బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ ఎల్మటి దేవేందర్‌రెడ్డి, జిల్లా నాయకులు జిట్టా రాజేందర్‌రెడ్డి, పి.శ్రీనివాస్‌గౌడ్, ఎస్.మల్లారెడ్డి, ఎ.సత్తయ్య, ఎన్.నర్సింహారెడ్డి, బాబురావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బొక్క నర్సింహారెడ్డి



షాబాద్: సరస్వతి శిశు మందిర్ ఆవరణలో మొక్క నాటుతున్న రాజ్‌భూపాల్‌గౌడ్ తదితరులు

తల్లిపేరున మొక్క నాటి సంరక్షించాలి

బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజ్‌భూపాల్‌గౌడ్

చేవెళ్ల: తల్లిపేరున ప్రతి ఒక్కరూ మొక్క నాటి సంరక్షించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజ్‌భూపాల్‌గౌడ్ అన్నారు. మున్సిపల్ పరిధిలోని మల్కాపూర్‌లో సోమవారం పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు అత్తెల్లి అనంత్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. శివాలయం ఆవరణలో మొక్క నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రధాని మోదీ పిలుపు మేరకు తల్లిపేరున ఒక మొక్క నాటి దానిని కాపాడుకోవాలన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, నాయకులు డాక్టర్ మల్గారి వైభవ్‌రెడ్డి, అంజనేయులుగౌడ్, శర్వలింగం, ఎ.శ్రీనివాస్, ఇంద్రసేనారెడ్డి, కృష్ణగౌడ్, విఠలయ్య, సత్యనారాయణ, భూజంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'స్థానిక' ఎన్నికలకు సన్నద్ధం కావాలి

షాబాద్: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీశ్రేణులు సన్నద్ధం కావాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజ్‌భూపాల్‌గౌడ్ అన్నారు. మండల కేంద్రంలోని సరస్వతి శిశు మందిర్ ఆవరణలో సోమవారం మొక్క నాటారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌ను గద్దె దింపేందుకు నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలన్నారు. కేంద్రం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కంచర్ల ప్రకాష్, మండల అధ్యక్షుడు మాణెయ్య, జిల్లాఅధికార ప్రతినిధి శ్రీధర్‌రెడ్డి, బీజేవైఎం జిల్లా అధికార ప్రతినిధి మహేందర్, బీజేవైఎం రాష్ట్ర స్వచ్ఛ భారత్ సెల్ కన్వీనర్ రాము పాల్గొన్నారు.

ప్రోత్సహిస్తే మరిన్ని పంటలు

'రైతు నేస్తం' సభలో యాచారం రైతు



సీఎం రేవంత్‌రెడ్డితో రైతు వెంకటనర్సయ్య దంపతులు

సాక్షి, రంగారెడ్డి జిల్లా: రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన 'రైతు నేస్తం' సభలో యాచారం మండలం చౌదరిపల్లి గ్రామానికి చెందిన రైతు వెంకటనర్సయ్య మాట్లాడారు. ఆయన మాటల్లోనే.. నాకు మూడెకరాల భూమి ఉంది. ఎకరంలో కడీల పందిరి ఉంది. కాకర, బీర వంటి తీగజాతి పంటలతో పాటు అంతర పంటగా టమాటా, ఆకు కూరల సాగు చేస్తున్నా. ఉద్యాన, వ్యవసాయశాఖ అధికారుల సహకారంతో కాయగూరలను పుష్కలంగా పండిస్తున్నా. మాకు సాగు నీళ్లు లేవు. మైలారం చెరువు నిండితేనే మాకు నీళ్లు. అది కూడా 700– 800 ఫీట్ల లోతు బోర్లు వేస్తేనే నీటి ఆనవాళ్లు లభిస్తున్నాయి. డ్రిప్ సహకారంతో పంటలు పండిస్తున్నాం. ఏడేళ్లుగా ప్రభుత్వం సబ్సిడీపై డ్రిప్ పైపులు ఇవ్వడం లేదు. మా చౌదరిపల్లి నుంచి రోజుకు ఆరు డీసీఎంల కూరగాయలు నగరానికి వస్తున్నాయి. మా రైతులకు డ్రిప్ ఇవ్వాలి. పంట సాగులో లేబర్ సమస్య కూడా ఎక్కువ ఉంది. సబ్సిడీపై యంత్రాలను ఇప్పించాలి. మిగిలిన భూమిలో ఆలుగడ్డ పండించా. ఆశించిన దానికంటే అధిక దిగుబడి వచ్చింది. ఆ తర్వాత అదే భూమిలో మక్క పెట్టాను. మాకు కొలువు లేదు. భార్యాభర్తలిద్దరం పని చేసుకుంటున్నాం. మాకు ముగ్గురు పిల్లలు. కూరగాయల సాగుతోనే వారి పెళ్లిళ్లు చేశాం. ప్రభుత్వం తగిన ప్రోత్సాహకాలు అందిస్తే మరిన్ని పంటలు పండిస్తాం.

బీజేపీతోనే తండాల అభివృద్ధి



గిరిజనులతో నాయకులు

గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కల్యాణ్‌నాయక్

కడ్తాల్: బీజేపీతోనే గిరిజన తండాల అభివృద్ధి సాధ్యమని గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కల్యాణ్‌నాయక్, నాగర్‌కర్నూల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు వేముల నరేందర్‌రావు అన్నారు. కేంద్రంలో ప్రధానిగా మోదీ బాధ్యతలు చేపట్టి 11 ఏళ్లే పూర్తయిన సందర్భంగా సోమవారం మండల పరిధిలోని మైసిగండిలో పార్టీ మండల అధ్యక్షుడు మహేశ్ దోనాదుల అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. గిరిజనుల అభివృద్ధికి ప్రధాని మోదీ అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్నారని తెలిపారు. గిరిజన విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించేందుకు సమ్మక్క సారలమ్మ గిరిజన యూనివర్సిటీ ఏర్పాటుకు చర్యలు చేపట్టారని పేర్కొన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు హరిప్రసాద్, ఎస్టీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు సాయిలాల్‌నాయక్, అధికార ప్రతినిధి లక్ష్మణ్‌నాయక్, రాష్ట్ర నాయకులు భగీరథ్, రెడ్యానాయక్, జిల్లా కౌన్సిల్ సభ్యుడు శ్రీశైలంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులతో జాగ్రత్త

- అధికారులు అప్రమత్తంగా ఉండాలి
- కలెక్టర్ నారాయణరెడ్డి
- ప్రజావాణిలో అర్జీల స్వీకరణ

సాక్షి, రంగారెడ్డిజిల్లా: సీజనల్ వ్యాధులపై అంతా అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ నారాయణరెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ఆయన ప్రజల నుంచి 68 అర్జీలను స్వీకరించారు. అనంతరం అధికారులతో మాట్లాడుతూ.. సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహించే ప్రజావాణిలో ప్రజల నుంచి అందిన వినతులను పెండింగ్‌లో పెట్టొద్దని అన్నారు. ఎప్పటికప్పుడు వాటిని పరిశీలించి, బాధితులకు తగిన పరిష్కార మార్గం చూపించాలని ఆదేశించారు. వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో గ్రామాల్లో పారిశుద్ధ్య లోపం తలెత్తే ప్రమాదం ఉందన్నారు. వీధుల్లో చెత్త పేరుకపోకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని, మురుగు నీటి కాల్వల్లోని వ్యర్థాలను తొలగించి, వరద నీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. దోమలు, ఈగలు వ్యాప్తి చెంది ప్రజలు సీజనల్ రోగాల బారినపడే ప్రమాదం ఉందని, వ్యాధుల నియంత్రణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలను వారికి వివరించాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్, డీఆర్‌ఓ సంగీత, వివిధ విభాగాల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

నైపుణ్యాభివృద్ధి పెంపొందించుకోవాలి

కేంద్ర మంత్రి జయంత్ చౌదరి

నందిగామ: నైపుణ్యాభివృద్ధిలో కఠినమైన, ఒకే పరిమాణానికి సరిపోయే విధానాలకు దూరంగా ఉండాలని కేంద్ర నైపుణ్యాభివృద్ధి, వ్యవస్థాపకత శాఖ (ఎంఎస్‌డీఈ) సహాయ మంత్రి జయంత్ చౌదరి అన్నారు. నందిగామ మండలం కన్హా శాంతి వనంలో సోమవారం ఎంఎస్‌డీఈ ఆధ్వర్యంలో నిర్వహించిన కౌశల్ మంథన్ ప్రాంతీయ వర్క్ షాపునకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్రాలు తమ స్థానిక ఆర్థిక అవసరాలకు తగినట్లుగా పరిష్కారాలను రూపొందించుకోవాలని సూచించారు. అప్పుడే అర్థవంతమైన ప్రభావాన్ని, స్థిరమైన పరివర్తనను సృష్టించగలమని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రభుత్వ యాజమాన్యంలోని ఐటీఐలకు జవాబుదారీతనం, నాణ్యత పనితీరు ఆధారిత ఫలితాల సంస్కృతిని పెంపొందించడానికి బలమైన గ్రేడింగ్, అసెస్‌మెంట్ ఫ్రేమ్ వర్క్‌ను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. ఈ వర్క్‌షాప్ ఫలితాల ఆధారిత నైపుణ్యం కోసం కేంద్ర, రాష్ట్ర సహకారాన్ని మరింతగా పెంచడం, స్థానిక నైపుణ్య అభివృద్ధిని జాతీయ ప్రాధాన్యతలతో సమలేఖనం చేయడం, వికసిత్ భారత్ 2047 లక్ష్యంగా ముందుకు తీసుకెళ్లేందుకు దృష్టి సారిస్తున్నట్లు చెప్పారు. జాతీయ ఐటీఐ అప్‌గ్రేడేషన్ పథకం అమలు, ఎక్సలెన్స్ సెంటర్ల నిర్వహణ, స్కిల్ ఇండియా డిజిటల్ హబ్‌ను ఏ విధంగా ఉపయోగించుకోవాలో చర్చించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో దక్షిణాది రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల మంత్రులు, నైపుణ్యాభివృద్ధి కార్యదర్శులు, ఉపాధి, శిక్షణ డైరెక్టర్లు, ఆర్‌డీఎస్‌ఈల నుంచి ప్రాంతీయ డైరెక్టర్లు, డిప్యూటీ డైరెక్టర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కేంద్రమంత్రి జయంత్ చౌదరి

ప్రైవేటు స్కూల్ బస్సులు మా ఊరికి రావద్దు

అడ్డుకున్న ఎల్లమ్మతండావాసులు

మంచాల: 'మా గ్రామ పిల్లలను ప్రైవేటు స్కూళ్లకు పంపించేది లేదు. కార్పొరేట్ సంస్థల బస్సులు ఇక్కడికి రావద్దు' అంటూ స్థానికులు తేల్చిచెప్పారు. వచ్చిన బస్సులను వెనక్కి పంపించారు. మండలంలోని ఎల్లమ్మతండాలో ఈ ఘటన చోటుచేసుకుంది. వివరాలివీ.. పిల్లలు లేరనే కారణంతో తండాలోని ప్రాథమిక పాఠశాల నాలుగేళ్లుగా మూతబడింది. బడిని కాపాడుకోవాలనే ఉద్దేశంతో అంతా ఏకమై దాతలు, గ్రామస్తుల సహకారంతో శిథిలావస్థకు చేరిన పాఠశాల భవనానికి మరమ్మతులు చేయించారు. బడిని తిరిగి తెరిపించి 60 మంది పిల్లలను చేర్పించారు. ప్రస్తుతం ఇద్దరు ఉపాధ్యాయులతో స్కూల్ ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో ప్రైవేటు స్కూళ్ల బస్సులను అనుమతించేది లేదని సోమవారం గ్రామస్తులు అడ్డుకున్నారు. అనంతరం స్థానిక నాయకుడు సబావత్ శేఖర్ విద్యార్థులకు ఉచితంగా నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రైబల్ టీచర్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రవీందర్, పాఠశాల కమిటీ చైర్మన్ పద్మ, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు హున్నానాయక్, మాజీ సర్పంచ్‌లు చందు నాయక్, పద్మ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



ప్రైవేట్ పాఠశాల బస్సులను అడ్డుకుంటున్న గ్రామస్తులు


తహసీల్దార్‌తో మాట్లాడుతున్న యాదయ్య తదితరులు

డబుల్ బెడ్రూం ఇళ్లు ఇవ్వాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి యాదయ్య

మంచాల: డబుల్ బెడ్రూం ఇళ్లను లబ్ధిదారులకు వెంటనే ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పగుడాల యాదయ్య డిమాండ్ చేశారు. సోమవారం మండల పరిధిలోని లింగంపల్లి గేట్ వద్ద సీపీఎం, బీఆర్ఎస్ ఆధ్వర్యంలో డబుల్ బెడ్రూం ఇళ్ల లబ్ధిదారులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యాదయ్య మాట్లాడుతూ.. మంచాల, నోముల, లింగంపల్లి గ్రామాలకు చెందిన నిరు పేదలను గత ఏడాదిన్నర క్రితమే డబుల్ బెడ్రూం లబ్ధిదారులుగా గుర్తించారన్నారు. నేటికి వాళ్లకు ఇళ్లు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేయడం సరైంది కాదన్నారు. ఇళ్లల్లో విద్యుత్, ప్లంబింగ్, డ్రైనేజీ సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. అధికారులు సరైన సమాధానం ఇవ్వక పోతే లబ్ధిదారులే స్వయంగా ఇళ్లల్లోకి పోతారని హెచ్చరించారు. ఈ విషయం తెలుసుకున్న తహసీల్దార్ వెంకట ప్రసాద్ అక్కడకు చేరుకొని.. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వెంటనే పరిష్కారం అయ్యే విధంగా చూస్తామన్నారు. స్పష్టమైన తేదీ ప్రకటించే వరకు కదిలేది లేదని నేతలు భీష్మించారు. దీంతో ఉన్నతాధికారులతో మాట్లాడి తహసీల్దార్ ఈ నెల 23న డబుల్ బెడ్రూం ఇళ్లను లబ్ధిదారులకు ఇస్తామని హామీ ఇచ్చారు. అనంతరం వారందరూ ధర్నా విరమించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి జంగయ్య, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, శ్యాం సుందర్, బుగ్గరాములు, కృష్ణ, జగన్, ఆర్.జంగయ్య, బాలరాజ్, బీఆర్ఎస్ నాయకులు పరమేష్, మహేందర్, కరుణాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భారీ వాహనాల రాకతో ట్రాఫిక్‌జాం

చేవెళ్ల: భారీ లారీలపై యంత్రాల తరలింపుతో చేవెళ్లలో సోమవారం ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురయ్యాయి. శంకర్‌పల్లి నుంచి చేవెళ్ల మీదుగా షాద్‌నగర్ వెళ్తున్న రెండు భారీ లారీలు పెద్ద పెద్ద యంత్రాలలో వెళ్లడంతో రోడ్డుపై వాహనాలు కనిపించక అంతరాయం ఏర్పడింది. హెవీ లోడ్‌తో వెళ్తున్న ఈ వాహనాలకు దాదాపు 20 టైర్లు ఉన్నాయి. దీంతో పట్టణ కేంద్రంలో వాహనదారులు వింతగా చూశారు.


రోడ్డుపై భారీ లోడ్‌లతో వెళ్తున్న వాహనం

మద్యం మత్తులో కారును ఢీకొట్టారు

బంజారాహిల్స్: మద్యం మత్తులో కారు నడిపిస్తూ చేసిన యాక్సిడెంట్ ఘటనలో నలుగురు యువకులను జూబ్లీహిల్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాల్లోకి వెళ్తే... జూబ్లీహిల్స్ రోడ్‌నెం. 10లోని స్పైసీ ఎవెన్యూ రెస్టారెంట్‌లో ఫుడ్ పార్సిల్ తీసుకునేందుకు వెళ్లిన కార్తికేయ అనే యువకుడు ఆదివారం రాత్రి 10.30 గంటల సమయంలో తన కారులో యూటర్న్ తీసుకుంటున్నాడు. అదే సమయంలో జూబ్లీహిల్స్ రోడ్ నెం 10లోని జోరా పబ్‌లో మద్యంతాగిన రఘు అనే యువకుడు తన ఫ్రెండ్స్ చరణ్, సాయికృష్ణతో పాటు మరో యువకుడితో కలిసి కారులో వేగంగా వచ్చి యూటర్న్ తీసుకుంటున్న కార్తికేయ కారును ఢీకొట్టారు. ఈ ఘటనలో కార్తికేయ కారు ధ్వంసం అయింది. బాధితుడి ఫిర్యాదుతో పోలీసులు రఘుకు బీత్ అనలైజర్ పరీక్షలు చేయగా మోతాదుకు మించి మద్యం సేవించినట్లు తేలింది. ఈ మేరకు రఘుతో పాటు కారులో ఉన్న ముగ్గురు యువకులపై పోలీసులు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

కీచకుడు చిక్కేదెలా?

- వృద్ధురాలిపై లైంగిక దాడి కేసులో పోలీసుల నిర్లక్ష్యం
- 26 మందిని విచారించినా ఎటూ తేలని వైనం
- కఠినంగా శిక్షించాలని గ్రామస్తుల డిమాండ్

యాచారం: సభ్య సమాజం తలదించుకునేలా మండలంలో ఇటీవల ఓ 90 ఏళ్ల వృద్ధురాలిపై లైంగిక దాడికి పాల్పడిన కామాంధుడిని కనిపెట్టే విషయంలో పోలీసులు నిర్లక్ష్యం చూపుతున్నారు. కాటికి కాలు చాచిన వృద్ధురాలిపై జరిగిన అఘాయిత్యం రాష్ట్రంలోనే సంచలనంగా మారింది తెలిసిందే. సంఘటన జరిగిన నాలుగైదు రోజులు గడుస్తునా ఆ కీచకుడికి కటకటాల్లోకి పంపే విషయంలో పోలీసుల కృషి విఫలమవుతున్నట్లు తెలుస్తోంది. తనపై లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తికి సంబంధించి వృద్ధురాలు కొన్ని క్లూ ఇచ్చింది. దాని ప్రకారమే పోలీసులు ఇప్పటివరకు 26 మందికి పైగా యువకులను అదుపులోకి తీసుకుని విచారించినట్లు తెలుస్తోంది. ఘటన జరిగిన రోజు సదరు గ్రామంలో రెండు, మూడు చోట్ల వివిధ రకాల దావత్‌లు జరిగినట్లు పోలీసులు గుర్తించారు. వారందరిని పిలిచి వివరాలు సేకరించారు. ఇదే విషయాన్ని సోమవారం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు.


యాచారం పోలీస్ స్టేషన్

వెంటనే స్పందించిన ఆయన ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజుకు ఫోన్ చేసి మాట్లాడారు. 90 ఏళ్ల వృద్ధురాలిపై అఘాయిత్యం జరిగి నాలుగైదు రోజులు గడుస్తున్న ఆ కామంధుడిని పట్టుకునే విషయంలో ఎందుకు విఫలమవుతున్నారని అడిగారు. రాష్ట్రంలో సంచలనంగా మారిన ఈ విషయంలో కఠినంగా ఉండాలని ఎమ్మెల్యే ఏసీపీకి సూచించారు.

వ్యసనాలకు బానిసలై

యువత, విద్యార్థులు మద్యానికి బానిసై నిత్యం ఘర్షణలు, తల్లిదండ్రులను సైతం లెక్కచేయకపోవడం వంటి సంఘటనలు జరుగుతున్నాయి. ఆయా కాలనీల్లోని యువత వ్యసనాలకు గురవ్వడంతో అటు తల్లిదండ్రులు గానీ, ఇటు పోలీసులు గానీ పట్టించుకోకపోవడం పెద్ద శాపంగా మారింది. స్థానిక యువత మద్యం తాగడం కోసం తూర్పున నల్గొండ జిల్లా మర్రిగూడ మండలం రూట్లో, పశ్చిమాన మాల్ దారిలోని వ్యవసాయ పొలాల్లోకి గుంపులు, గుంపులుగా వెళ్తున్నారని గ్రామస్తులు అంటున్నారు. కామాంధుడిని పట్టుకుని కఠిన శిక్ష పడేలా పోలీసులు కృషి చేయాలని ఆ గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు. వ్యవసాయ పొలాలకు, పశువుల, మేకల, గొర్రెల పెంపకం కోసం ఒంటరిగా వెళ్లాలంటేనే జంకుతున్నారు.

గంజాయి సేవిస్తున్న ఇద్దరి అరెస్టు

బంజారాహిల్స్: గంజాయి సేవిస్తున్న ఇద్దరిని బంజారాహిల్స్ పోలీసులు అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళితే..శ్రీకృష్ణానగర్ ఇందిరానగర్ గడ్డ ప్రతుల్ హోండా సర్వీసింగ్ సెంటర్ సమీపంలో ఇద్దరు గంజాయి సేవిస్తున్నారన్న విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు ఆ ప్రాంతంలో తనిఖీలు నిర్వహించారు. అనుమానాస్పదంగా కనిపించిన షేక్‌పేట వినోభానగర్‌కు చెందిన స్విగ్గీ డెలివరీ బాయ్ గోగుల శ్రీశైలం (19), రహమత్‌నగర్ వీడియోకాలనీకి చెందిన ఆఫీస్ బాయ్ యశ్వంత్‌గౌడ్ (19)లను విచారించగా వారు గంజాయి సేవించినట్లు గుర్తించారు. ఈ మేరకు ఇరువురిని అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. వారి వద్ద నుంచి 1.33 గ్రాముల గంజాయితో పాటు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. బంజారాహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కాలువ కబ్జాపై నిలదీత

కొంగరకలాన్‌లో అధికారులు సర్వే చేస్తుండగా స్థానికుల మండిపాటు

ఇబ్రహీంపట్నం రూరల్: దాతర్ చెరువు నుంచి వచ్చే వరద కాలువ కబ్జాకు గురైందని గగ్గోలు పెడుతున్నా పట్టించుకోవడం లేదని ఆదిబట్ల మున్సిపల్ పరిధిలోని కొంగరకలాన్‌వాసులు మండిపడ్డారు. చెరువు నుంచి వచ్చే వరద కాలువ, పక్కనున్న ప్రభుత్వ భూమిని కబ్జా చేశారని ఫిర్యాదు చేయడంతో సోమవారం ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు జాయింట్ సర్వే నిర్వహించారు. ఈ సర్వే వద్దకు భారీగా వచ్చిన స్థానికులు అధికారులను నిలదీశారు. ప్రభుత్వ భూములు, శ్మశాన వాటికలు, కాలువలను కబ్జా చేస్తున్నా ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. ఇరిగేషన్ శాఖ డీఈ చెన్నకేశవరెడ్డి, ఏఈ హరితలు వచ్చి సందర్శిస్తుండగా వారిపై పలు ప్రశ్నలు గుప్పించారు. కాలువ విస్తీర్ణం ఎంత, సైజులు ఏమయ్యాయి అని అడగ్గా.. సర్వే చేసి త్వరలోనే వివరాలు వెల్లడిస్తామని తెలిపారు. ఈ క్రమంలో కొంతసేపు ఘర్షణ వాతావరణం నెలకొంది. రియల్టర్ల కోసమే ఇష్టం వచ్చినట్లుగా అధికారులు వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపించారు. కబ్జాకు గురైన కాలువను కాపాడి, అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని కోరారు.


ఇరిగేషన్ అధికారులను నిలదీస్తున్న కొంగరకలాన్‌వాసులు

త్వరలో మరో ఐదు ఎస్టీపీలు ..!

ఇప్పటికే 37 ఎస్టీపీల ద్వారా మురుగు శుద్ధి

- వంద శాతం మురుగు శుద్ధి చేరువలో..
- 20న సీఎం చేతులు మీదుగా ప్రారంభం
- ఏర్పాట్లను పరిశీలించిన జలమండలి ఎండీ అశోక్ రెడ్డి

సాక్షి, సిటీబ్యూరో: వంద శాతం మురుగును శుద్ధిలో భాగంగా మరో మురుగు శుద్ధి కేంద్రాలు అందులో బాటులోకి రానున్నాయి. సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఈనెల 20న ప్రారంభించేందుకు జలమండలి కసరత్తు చేస్తోంది. ఇప్పటికే 37 ఎస్టీపీల ద్వారా మురుగు శుద్ధి జరుగుతుండగా తాజాగా అంబర్‌పేట-1, శివాలయనగర్,నల్లగండ్ల, అత్తాపూర్-1, పాలపిట్ట ఎస్టీపీల నిర్మాణాలు పూర్తి చేసి ట్రయిల్ రన్ నిర్వహిస్తోంది. మరో మూడు ఎస్టీపీ నిర్మాణ పనులు తుది దశలు ఉన్నాయి. మరోవైపు రాబోయే పదేళ్ల వరకు ఉత్పత్తయ్యే మురుగును సైతం శుద్ధి చేసేందుకు ముందస్తు ప్రణాళికలో భాగంగా అమృత్ 2.0 పథకం కింద మరో 39 ఎస్టీపీల నిర్మాణాలకు సిద్ధమైంది.వాస్తవంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వం వంద శాతం మురుగు శుద్ధి లక్ష్యంతో సుమారు రూ.3,866.21 కోట్ల వ్యయంతో 3 ప్యాకేజీల్లో 5 సర్కిళ్లలో కొత్తగా 31 ఎస్టీపీల నిర్మాణాలకు సిద్ధం కాగా ..స్థలాల సేకరణ, ఇతరాత్ర కారణాలతో వాటి సంఖ్యను ఇరవై ఎస్టీపీలకు కుదించిన సామర్థ్యం తగ్గకుండా పనులు పూర్తి చేసింది.అందులోఇప్పటికే 12ఎస్టీపీలు మురుగు నీటిని శుద్ధి చేస్తుండగా, తాజాగా మిగిలిన ఎనిమిదింటిలో ఐదు ఎస్టీపీలు అందుబాటులో రానున్నాయి.


అంబర్‌పేట్ సీవరేజి ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న అశోక్‌రెడ్డి

అంబర్ పేట్ ఎస్టీపీ పనుల పరిశీలన

అంబర్‌పేట్ లో నిర్మిస్తున్న 212.5 ఎమ్మెల్డీ సీవరేజి ట్రీట్‌మెంట్ ప్లాంట్(ఎస్టీపీ) నిర్మాణ పనులను జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్, ఎంఆర్డీసీఎల్ ఎండీ నర్సింహారెడ్డి, జలమండలి ఈడి మయాంక్ మిట్టల్,వివిధ శాఖల అధికారులతో కలిసి పరిశీలించారు. తుది దశలో ఉన్న పనుల్లో వేగంపెంచి రెండు మూడు రోజుల్లో ప్రారంభానికి సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని ఎండీ పేర్కొన్నారు. మిగిలిపోయిన సివిల్ వర్క్‌లు, యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని సూచించారు.

ద్విచక్ర వాహనాల దొంగకు రిమాండ్

7 బైకులు స్వాధీనం

మీర్‌పేట: ద్విచక్ర వాహనాలను చోరీ చేస్తున్న పాత నేరస్తున్ని మీర్‌పేట పోలీసులు అరెస్ట్ చేసి రూ.7 లక్షల విలువైన వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. హస్తినాపురం క్రిస్టియన్ కాలనీకి చెందిన బండ్రవల్లి రాకేష్(23) చిన్ననాటి నుంచే చెడు వ్యసనాలకు బానిసయ్యాడు. ఆర్థిక సమస్యల కారణంగా గతంలో వనస్థలిపురం, ఎల్‌బీ నగర్, సరూర్‌నగర్, చైతన్యపురి, మలక్‌పేట, మహబూబ్‌నగర్ రూరల్, వనపర్తి టౌన్, రాజేంద్రనగర్, కీసర, నేరేడ్‌మెట్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో 36 చోరీలు చేసి జైలుకు వెళ్లాడు. జైలు నుంచి బయటకు వచ్చి తిరిగి మీర్‌పేటతో పాటు హయత్‌నగర్, వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ల పరిధిలో రాత్రివేళల్లో కాలనీల్లో తిరుగుతూ ఇండ్ల ముందు పార్కు చేసిన ద్విచక్ర వాహనాలను నకిలీ తాళాలు ఉపయోగించి దొంగిలించాడు. దర్యాప్తు చేపట్టిన మీర్‌పేట పోలీసులు సోమవారం రాకేష్‌ను రిమాండ్‌కు తరలించి అతని వద్ద నుంచి 7 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.

యూనిఫైడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ ప్రారంభం

సాక్షి, సిటీబ్యూరో: ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొనేందుకు, అత్యవసర పరిస్థితుల్లో తగిన కార్యాచరణ చేపట్టేందుకు రైల్‌నిలయంలో ఏర్పాటు చేసిన యూనిఫైడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను దక్షిణమధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్‌జైన్ సోమవారం ప్రారంభించారు. రైల్వే మంత్రిత్వ శాఖ ఆదేశాలకు అనుగుణంగా విపత్తు నిర్వహణ నియంత్రణ గది వద్ద ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అలాగే జోనల్ ఇంటర్‌ఛేంజ్ మానిటరింగ్ సిస్టమ్, స్టేషన్ ఇన్ఫర్మేషన్ మానిటరింగ్ సిస్టమ్‌లను, మెట్టుగూడలోని ఎస్అండ్‌టీ వర్క్‌షాప్‌లో సోలార్ ప్లాంట్‌ను కూడా ప్రారంభించారు.

ప్రభుత్వ నిర్ణయం హర్షణీయం

హిమాయత్‌నగర్: నగరంలో 60 వేల కొత్త ఆటో రిక్షా పర్మిట్లు ఇవ్వడానికి రాష్ట్ర ప్రభుత్వం జీఓ జారీతో పాటు రవాణా రంగ సంక్షేమ బోర్డు ఏర్పాటుకు ప్రభుత్వ ప్రతిపాదన ప్రకటించడం పట్ల తెలంగాణ రాష్ట్ర ఆటో రిక్షా డ్రైవర్ల సంఘాల జేఏసీ హర్షం వ్యక్తం చేసింది. సోమవారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో జరిగిన మీడియా సమావేశంలో జేఏసీ కన్వీనర్ బి.వెంకటేశం(ఎఐటియుసి) సీఎం రేవంత్ రెడ్డి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. రెండు దశాబ్దాలుగా అనేక రూపాల్లో పోరాటాలు నిర్వహించామన్నారు. సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివ రావు, ఎమ్మెల్సీ కోదండ రాంలు ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి, పలుమార్లు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో చర్చలు జరిపి ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని అన్నారు. 2013 నుండి ఆటో మీటర్ చార్జీలు నాటి ప్రభుత్వాలు పెంచకుండా నిర్లక్ష్యం వహించడంతో ఆటో డ్రైవర్లు అనేక ఆర్థిక సమస్యలను ఎదుర్కొంటున్నారని అన్నారు.

ఫీవర్‌లో రేబిస్ కేసు నమోదు

నల్లకుంట: నల్లకుంట ఫీవర్ ఆసుపత్రిలో రేబీస్ కేసు నమోదైంది. గుడివాడకు చెందిన రాము(36)ను ఆరు నెలల క్రితం ఓ వీధి కుక్క గాయపరిచింది. ఆ సమయంలో రెండు ఇంజక్షన్స్ తీసుకుని మిగిలినవి తీసుకోలేదు. ఉపాధి కోసం నగరానికి వచ్చి పార్శిగుట్టలో నివాసముంటున్నాడు. ఈ క్రమంలో ఆదివారం అస్వస్థతకు గురైన వింతగా ప్రవర్తించసాగాడు. దీంతో కుటుంబ సభ్యులు చికిత్స కోసం సోమవారం నల్లకుంట ఫీవర్ ఆసుపత్రికి తీసుకువచ్చారు. వైద్యులు పరీక్షించి రేబీస్ లక్షణాలు ఉన్నట్లు గమనించి రేబీస్ వార్డులో చికిత్సలు అందిస్తున్నారు.

పీజీ కోర్సులకు రేపటి నుంచి దరఖాస్తుల స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రంలోని వివిధ విశ్వవిద్యాలయాల్లో పీజీ కోర్సుల ప్రవేశాలు అధికారుల కసరత్తు ప్రారంభించారు.ఈ నెల 13న రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్‌తో పాటు ఇతర అధికారులు, వివిధ వర్సిటీల వీసీలు, సీపీగెట్ కన్వీనర్, ఇతర అధికారులు చర్చించి 18న నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు ప్రకటించారు.

గతంలో కేవలం పత్రికల్లో ప్రకటన జారీ చేసి పీజీ అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభించే వారు. కానీ ఈసారి నోటిఫికేషన్ గతేడాది కంటే నెల రోజులు ఆలస్యమైంది. ఇతర కోర్సుల (లాసెట్, ఎడ్‌సెట్, ఐసెట్, పీజీఈసెట్, పీఈసెట్) నోటిఫికేషన్ ఏప్రిల్‌లో విడుదలై పరీక్షల ఫలితాలను కూడా ప్రకటించగా సీపీగెట్ ప్రక్రియ వెనుకబడింది. దీంతో దరఖాస్తుల స్వీకరణ, ప్రవేశ పరీక్షలు, ఫలితాలు, కౌన్సెలింగ్ తరగతుల ప్రారంభం, సెమిస్టర్ పరీక్షలు వాటి ఫలితాలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఈ కారణంగా పీజీ కోర్సుల విద్యా సంవత్సరం గాడితప్పింది. ఇదిలా ఉండగా కొన్ని వర్సిటీలు, అటానమస్ కాలేజీల్లో డిగ్రీ పరీక్షలు, ఫలితాల విడుదలలో జాప్యం వలన టీజీ సీపీజీఈటీ-2025 నోటిఫికేషన్ ఆలస్యంగా విడుదల చేసినట్లు అధికారులు తెలిపారు. కానీ డిగ్రీ అర్హతతో ఇతర సెట్లను నిర్వహించిన విషయాన్ని ప్రస్తావించడం లేదు.

రేపటి నుంచి దరఖాస్తుల స్వీకరణ

రాష్ట్రంలోని 8 వర్సిటీల్లో ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ, ఇతర పీజీ, ఐదేళ్ల కోర్సుల్లో ప్రవేశాలకు జరిగే ఎంట్రన్స్ టెస్ట్‌కు రేపటి నుంచి(18న) ఆన్‌లైన్ దరఖాస్తులను స్వీకరించనున్నారు.

గంజాయితో పట్టుపడ్డ వ్యక్తి రిమాండ్

మేడిపల్లి: గంజాయితో పట్టుపడ్డ ఓ వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. మేడిపల్లి పోలీసులు తెలిపిన మేరకు.. సోమవారం మల్కాజ్‌గిరి ఎస్ఓటీ పోలీసులు పెట్రోలింగ్ చేసుండగా కోల్‌కత్తాకు చెందిన మహమ్మద్ అదీల్(36) హనుమాన్ నగర్ కాలనీలో అనుమానాస్పదంగా కనిపించాడు. అదుపులోనికి తీసుకుని విచారించగా 30 గ్రాముల గంజాయి ప్యాకెట్ లభించింది. స్వాధీనం చేసుకొని మేడిపల్లి పోలీసులకు అప్పగించారు ఈ మేరకు రిమాండుకు తరలించారు.

కబ్జా కోరల్లో నాలాలు, పాత లేఔట్లు!

శ్లాబులు వేసి నాలాలపై నిర్మాణాలు

- పాత లేఔట్లలో పాస్‌పుస్తకాలతో పాగా
- వీలున్న చోటల్లా పార్కులూ స్వాహా
- హైడ్రా ప్రజావాణిలో 47 ఫిర్యాదులు

సాక్షి, సిటీబ్యూరో: ఓపక్క వర్షాకాలం... మరోపక్క హైడ్రా స్పందన... వెరసి నాలాల కబ్జాలపై వరుస ఫిర్యాదులు వస్తున్నాయి. రాజధానిలోని కొన్ని నాలాలను పూడ్చి కబ్జా చేస్తుంటే... మరికొన్నింటి మీద శ్లాబులు వేసి ఇళ్లు, దుకాణాలు నిర్మిస్తున్నారని అధికారుల దృష్టికి తీసుకువస్తున్నారు. ఫలితంగా నాలాల్లో పేరుకుపోతున్న చెత్తను తొలగించడం సాధ్యం కాక అవి పూడుకుపోతున్నాయని వాపోతున్నారు. సోమవారం హైడ్రా ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి ద్వారా అనేక ఫిర్యాదులు అందాయి. మల్కాజిగిరి, బాచుపల్లి, సికింద్రాబాద్, పద్మారావునగర్, మాదాపూర్ ప్రాంతాల నుంచి అనేక మంది వచ్చి ఫిర్యాదు చేశారు. ఒకప్పటి గ్రామపంచాయతీ లేఔట్లను తిరిగి వ్యవసాయ భూములుగా చిత్రీకరిస్తున్న కొందరు తప్పుడు పాస్ పుస్తకాలతో కాజేస్తున్నారని మరి కొన్ని ఫిర్యాదులు వచ్చాయి. మొత్తం 47 ఫిర్యాదుల్లో అత్యధికంగా నాలాలు, పాత లేఔట్లకు సంబంధించినవే కావడం గమనార్హం. వీటిని సీరియస్‌గా తీసుకున్న కమిషనర్ ఏవీ రంగనాథ్ సమగ్ర విచారణ జరపడంతో పాటు తక్షణం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

కీలక ఫిర్యాదులు ఇలా...

- మేడ్చల్ జిల్లా కొరెముల గ్రామం సర్వే నెం.739 నుంచి 749 వరకూ 147 ఎకరాల్లో ఏకశిలానగర్ పేరుతో లే ఔట్‌ను 1985లో వేశారు. అందులోని 47 ఎకరాలను 2006లో వ్యవసాయ భూమిగా మార్చేసిన ఓ వ్యక్తి లే ఔట్ స్వరూపాన్నే మార్చేశారని ప్లాట్ల యజమానులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. ఇదే లే ఔట్‌లో రెండు బడా రియల్ ఎస్టేట్ సంస్థలు ప్రహరీలు నిర్మించి కొంతమేర కాజేశాయని పేర్కొన్నారు.
- ఇదే గ్రామంలోని సర్వే నెం.796లో 11.20 ఎకరాల భూమి ఉండగా.. ఇందులో 7.20 ఎకరాల పరిధిలో ఓ మెడికల్ కాలేజీని ఏర్పాటు చేశారు. మిగతా నాలుగు ఎకరాలు కబ్జా చేసి దీంతో పాటు నదెం చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఈ నిర్మాణాలు చేపడుతున్నారని ప్రజావాణి ద్వారా హైడ్రాకు ఫిర్యాదు అందింది.
- పంజగుట్ట ఆఫీసర్స్ కాలనీలో వెయ్యి గజాల పార్కు స్థలం ఉండేది. దీని నుంచి 500 గజాల స్థలంలో దుర్గాభవానీ ఆలయం నిర్మించారు. మిగిలిన 500 గజాల స్థలం కబ్జా కాకుండా పార్కును అభివృద్ధి చేయాలని అక్కడి నివాసితులు హైడ్రాను ఆశ్రయించారు. ఆలయంతో పాటు చుట్టూ ఉన్న దుకాణాల ద్వారా వచ్చే ఆదాయాన్ని పార్కు కోసం కేటాయించాలని కోరారు. శ్రీనగర్‌కాలనీ నుంచి వచ్చే వరద కాలువ తమ కాలనీ ద్వారా వెళ్లేదని ఇప్పుడా కాలువ మాయం కావడంతో వరదంతా తమ నివాసాలను ముంచెత్తుతోందని వాపోయారు.
- అల్వాల్ మండలం జొన్న బండలోని వజ్ర ఎన్‌క్లేవ్‌లో 900 గజాల పార్కు స్థలం కబ్జా అవుతోందని, దానికి ఫెన్సింగ్ వేసి కాపాడాలంటూ అక్కడి నివాసితులు హైడ్రాను కోరారు. అక్కడ రహదారులను కూడా వదలకుండా కొందరు కబ్జా చేస్తున్నారని 236 ప్లాట్లకు పార్కు లేకుండా అవుతోందని పేర్కొన్నారు.
- దేవరయాంజల్‌లోని తురకోని కుంట శిఖం భూమిలో లారీలకు సంబంధించిన వేబ్రిడ్జ్ ఏర్పాటు చేస్తున్నారని వెంటనే ఆ పనులు ఆపి చెరువును కాపాడాలని సీతారామచంద్రస్వామి దేవస్థానం భూముల పరిరక్షణ సమితి ప్రతినిధులు హైడ్రాను కోరారు. ఇదే ప్రాంతంలో దేవస్థానానికి చెందిన భూమి కబ్జా అవుతోందని సేవ్ దేవరయాంజల్ ప్రతినిధులు హైడ్రా దృష్టికి తెచ్చారు.
- దేవరయాంజల్ చెరువుకు వెళ్లాల్సిన వరద కాలువను మళ్లించడంతో అది ఊరు నుంచి వచ్చే మురుగు ప్రవాహానికి ఆటంకంగా మారుతోందని స్థానికులు ఫిర్యాదు చేశారు. వరద కాలువ నేరుగా చెరువుకు చేరేలా చేస్తే తమకు వరద ముప్పు తప్పుతుందని అభ్యర్థించారు.

